క్లుప్తంగా

విజేతలకు సీపీ అభినందన



విజేతలను అభినందిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

మల్కాపురం: జింక్ మైదానంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు శనివారం ట్రోఫీతో సీపీ శంఖబ్రత బాగ్చిని కలిశారు. జట్టు కెప్టెన్ వి.త్రినాథ్ (మల్కాపురం లా అండ్ ఆర్డర్ పోలీస్), టీమ్ సభ్యులు శ్రీకాంత్ (ఎస్ఐ),టి.వరప్రసాద్ సీపీని కలిసిన వారిలో ఉన్నారు. వారిని సీపీ అభినందించి పోలీస్ శాఖకు మరింత కీర్తి తెచ్చే విధంగా నడుచుకోవాలని సూచించారు.

నేడు కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: జూనియర్ కాలేజీల్లో ఆదివారం తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

కుటుంబ సభ్యుల చెంతకు యువతీ యువకుడు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ శివారులో అనుమానాస్పదంగా కూర్చుని ఉన్న యువతీ యువకులను రైల్వే పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. సింహాచలం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నార్త్ వైపున శివారున వీరు ఉన్నారు. డ్రైవ్ అండ్ చెకింగ్‌లో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గమనించి ఆరా తీశారు. వీరి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలిపారు. వీరు ఆందోళనకరంగా ఉన్నట్లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ ఎస్‌వీఎస్ రావు ఇద్దరి వివరాలు సేకరించగా మధురవాడ వాంబే కాలనీ అని చెప్పారు. యువకుడు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యువతి ఇంటర్ చదువుతోంది. ఇంట్లో చెప్పకుండా ఇక్కడికి వచ్చినట్లు తెలుసుకున్న పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు తప్పిపోయినట్లు పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పీఎంపాలెం పోలీసులు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పోలీసుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన వారితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నలుగురు మునిగిపోతుండగా లైఫ్‌గార్డ్స్ వారి ప్రాణాలు కాపాడారు. విజయనగరం జిల్లా గరివిడి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన 15 మంది శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో తోలాడ గొల్లబాబు, కళ్యాణ కీర్తన, శోభ, కరిశెట్టి శాంతి కుమారి మునిగిపోయారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ వారిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు.

దయనీయం.. సేవా నిలయం

- శిథిలమైన మీ సేవా భవనం
- ఏసీ యూనిట్లు.. ఫ్యాన్లు, ఫర్నిచర్ చోరీ
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా భవనం లోపలి భాగం



శిథిలావస్థకు చేరిన మీ సేవా భవనం

మల్కాపురం : ప్రజావసరాల కోసం ఏర్పాటు చేసిన మీ సేవా భవనం వినియోగంలో లేకపోవటంతో శిథిలావస్థకు చేరింది. దీంతో భవనం మొత్తం పెచ్చులూడి విలువైన సామగ్రి దొంగల పాలవుతోంది. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఇది ఆకతాయిల అడ్డాగా మారింది. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద గల ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి ఆనుకుని (జీవీఎంసీ 30 పడకల ఆస్పత్రి) 2003లో అప్పటి కార్పొరేషన్ అధికారులు సుమారు రూ. 30 లక్షల వ్యయంతో మీ సేవా భవనాన్ని ఏర్పాటు చేశారు. దీనిని అప్పటి మేయర్ రాజాన రమణి ప్రారంభించారు. సింధియా నుండి జింక్ వరకు ప్రజలు కుల, ఆదాయ, నివాస వంటి పలు ధ్రువీకరణ పత్రాలతో పాటు కరెంట్ బిల్లుల చెల్లింపు, ఆస్తి పన్నుల వంటి పలు సేవలను ఇక్కడ పొందే వారు. వినియోగదారుల సౌకర్యార్థం ఇక్కడ ఆరు ఏసీ యూనిట్లు, 12 సీలింగ్ ఫ్యాన్‌లు, విలువైన ఫర్నిచర్, కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇక్కడ సేవలను నిలిపేయడంతో ఈ భవనం మూతపడింది. ఇదే అదనుగా భావించి దొంగలు భవానం కిటికీలు తొలగించి విలువైన వస్తువులు దొంగిలిస్తున్నారు. ఏసీ యూనిట్లు, బ్యాటరీలు ఈ విధంగానే పోయి ఉండొచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఈ భవనంలో ఉండాల్సిన సీలింగ్ ఫ్యాన్లలో ఇప్పుడు ఒక్కటి కూడా లేదు. అన్నీ చోరీ జరిగాయి. ఈ భవనం మూత పడి సంవత్సారాలు గడవటంతో లోపలి సీలింగ్, శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. రాత్రి వేళల్లో భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని ప్రజావసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే జనరేటర్





రహదారిలో ఏర్పాటు చేసిన జనరేటర్

విశాఖ విద్య: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ సమీపంలో గాంధీ నగర్‌కు వెళ్లే దారిలో జనరేటర్ ఏర్పాటు చేయడంతో పరిసర ఇళ్ల వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు భవనాలకు సంబంధించిన జనరేటర్‌ను రహదారిపై పెట్టడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా అయితే ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అయినా జనరేటర్ అయినా వారికి చెందిన స్థలంలోనే ఏర్పాటు చేసుకోవాలి.
అది కూడా ఇతరులకు ఇబ్బంది కలుగని రీతిలో ఉండాలి. అయితే ఇక్కడి రహదారిలో ఏర్పాటు చేసిన జనరేటర్ జీవీఎంసీ అధికారులు, సిబ్బందికి కనిపించబం లేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్ట్ నేతలు

మహారాణిపేట : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ల ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ రూ. 1250 మెడీ క్లెయిమ్ చెల్లించాలని, జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరోతి ఈశ్వరరావు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై డీసీఎం వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం : ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై లామినేషన్ షీట్లు తీసుకెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్టు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి గురుద్వార్ వద్ద లామినేషన్ షీట్లు లోడింగ్ చేసుకున్న సిబ్బంది ఉదయం బెంగళూరు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై రోటరీలో వెళ్తున్న సమయంలో లోడ్ చేసిన లామినేషన్ షీట్లు ఒక్కసారిగా ఎడమ వైపునకు దొర్లడంతో వ్యాన్ ఒరిగిపోయి ఫ్లైఓవర్ రెయిలింగ్ వాల్‌ను ఆనుకుని నిలిచిపోయింది. ఇది గమనించి ట్రాఫిక్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వ్యాన్‌లో ఉన్న లామినేషన్ షీట్లను తొలగించి మరో వ్యాన్‌లో తరలించారు. క్రేన్ సాయంతో బోల్తా పడిన వ్యాన్‌ను పక్కకి తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కొండలరావుకు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ వ్యాన్‌పై టార్పా చుట్టి ఉండడంతో ఈ షీట్లు బ్రిడ్జ్ దిగువకు పడకుండా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం వేకువ జామున జరగడం వల్ల జన సంచారం, వాహనాల రద్దీ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని అంతా చెబుతున్నారు. డ్రైవర్ ఎయిర్‌పోర్టు పోలీసులఅదుపులో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి ఎదురువానిపాలెం, ములగాడ గ్రామాల్లో ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లాగ్ ఆఫ్ కన్వీనియన్స్‌పై ఉపన్యాసం



ఫ్లాగ్ ఆఫ్ కన్వీనియన్స్‌పై ఉపన్యసిస్తున్న రియర్ అడ్మిరల్ శంతనుఝూ

సింధియా : మాన్‌సూన్ సిరీస్ లెక్చర్లలో భాగంగా విశాఖలోని సాముద్రికా ఆడిటోరియంలో ఫ్లాగ్ ఆఫ్ కన్వీనియన్స్ అనే అంశంపై చీఫ్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ శంతనుఝూ ఉపన్యాసించారు. తూర్పు నావికాదళంలోని సర్వీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సముద్ర పరిశ్రమలో ఫ్లాగ్స్ ఆఫ్ కన్వీనియన్స్, నేషనల్ ఓనర్‌షిప్ మధ్య జరిగే పరస్పర చర్యలను వివరించారు.

విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో స్వల్ప మార్పు



తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ప్రతిరోజు బయల్దేరే విశాఖపట్నం-బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ వేళలు పలాసలో స్వల్పంగా మారినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైలు ఆగస్టు 15వ తేదీ నుంచి పలాస స్టేషన్‌కు రాత్రి 6.43 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.48 గంటలకు బయల్దేరుతుంది.

సిరుల తల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు

- రేపటి నుంచి ప్రారంభం



సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసుల రెడ్డి, సహాయ కార్య హణాధికారి వి.రాంబాబు తెలిపారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16న)వరలక్ష్మీ వ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో తెలియజేశారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలు (ఆగస్టు 9, 16, 23, 30) విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి ప్రారంభం

ఈ నెల 5వ తేదీ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు. నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందని తెలిపారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.400 టికెట్ రుసుం చెల్లించాలన్నారు. ప్రసాదం ఉచితంగా అందజేస్తారు. స్థానికేతరులు ఎవరైనా పూజలో పాల్గొనలేనిచో వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు పేర్కొన్నారు. పూజా రుసుము చెల్లింపు, ఇతర వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చని తెలియజేశారు.

మరణాంతరం.. మళ్లీ జీవనం



కార్యక్రమంలో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద తదితరులు

సీతంపేట: అవయవ దానం ద్వారా మరణించిన తర్వాత కూడా జీవించవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా అఖిల భారత అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరణం తర్వాత కూడా జీవించాలంటే ప్రతి ఒక్కరూ అవయవదానం చెయ్యాలని కోరారు. ఏఎంసీ అనాటమి విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్ మాట్లాడుతూ అవగాహన కోసమే ప్రభుత్వం అవయవ దాన దినోత్సవం జరుపుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ శరీరం వృథాకాకుండా, మానవతా దృక్పథంతో అవయవదానం చేయాలని కోరారు. రక్తదాన ఉద్యమకర్త పి.వినోద్‌బాబు మాట్లాడుతూ రక్తదానం, అవయవదానం వెనుక నిజమైన దైవత్వం ఉందన్నారు. అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మరణించినా జీవించండి అంటూ స్టిక్కర్స్ ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో అవయవదానం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సీఐఎస్ఎఫ్ అధికారి డాక్టర్ ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవ దానం కోసం 20 ఏళ్లుగా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫణి, ఏఎంసీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సంస్థ కార్యదర్శి ఎస్.బాబూరావు, సంస్థ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. కొంతమంది దుకాణదారులు రోడ్డెక్కేస్తుండడంతో సమస్య జఠిలంగా మారుతోంది. ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసులు తరచూ హెచ్చరికలు చేస్తున్నా కొంతమంది వ్యాపారులకు చెవికెక్కడం లేదు. దీంతో ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. సాయంత్రం వేళలో ఆ దారిలో వాహనాలు సవ్యంగా ముందుకు కదలని పరిస్థితి ఉంది. ఫ్లై ఓవర్‌తో పాటు బాజీ జంక్షన్‌లో ఎక్కువగా ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణలు ఉన్నాయి. దుకాణాలకు వచ్చే వినియోగదారులు బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే వాహనాలు నిలిపి కొనుగోలు చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడూ ఆక్రమణదారులపై కన్నెర్ర చేస్తున్నా కూటమి నేతలు రంగంలోకి దిగడంతో సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఈ పరిణామాలతో ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి గోపాలపట్నం మీదుగా సింహాచలం రోడ్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పోలీసులు ఉన్నతాధికారులు ఆక్రమణలపై దృష్టి సారిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రమేష్ నాయుడికి న్యాయం జరిగేలా చూస్తాం



బాధితుడి బంధువులతో ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీ ప్రాంతానికి చెందిన రమేష్‌నాయుడు అనే వ్యక్తి ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు గుర్తుతెలియని దొంగలు అపహరించిన విషయం తెలిసిందే.అయితే ఇప్పటికీ దొంగల ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాధితుడు రమేష్‌నాయుడు తన కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పి.గణబాబును శనివారం కలిశారు. తన వద్ద పని చేస్తున్న సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు నగదు ఉంచానని, కుమర్తె వివాహం నిమిత్తం ఇంట్లో బంగారం ఆభరణాలు సమకూర్చుకున్నట్టు వివరించారు. దొంగలను పట్టుకుని వస్తువులు రికవరీ చేసే విధంగా సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు.దీనిపై స్పందించి ఎమ్మెల్యే గణబాబు సమస్యను పోలీస్ కమిషనర్ దృష్టిలో పెట్టి త్వరగా న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించుకుంటేనే విశాఖ మనుగడ



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : కార్పొరేట్ శక్తుల నుంచి విశాఖ జిల్లా ప్రజలను, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాలకు ఇక్కడి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు, కుసులువాడ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా చేపట్టారు. దీనికి సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని గత ఇరవై ఏళ్లుగా పాలకులు చెబుతున్నా వాస్తవానికి అభివృద్ధి ముసుగులో కార్పొరేట్ శక్తులతో మైనింగ్, భూదందా వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. విశాఖ బీచ్ సీఆర్‌జెడ్ జోన్‌లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఆనందపురం, కుసులువాడ ప్రాంతాల్లో గ్రావెల్, మైనింగ్ వంటి వాటికి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ, అటవీ రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతులివ్వడాన్ని తప్పు పట్టారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాల్లాగే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, ఆర్ఎస్ఎన్ మూర్తి, బి.రమణి, నరేంద్రకుమార్, సుబ్బారావు, పి.మణి, రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలు అమృత తుల్యం



62వ వార్డులో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



58వ వార్డులో..

సింధియా: తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం అంగన్‌వాడీ-1, 2 కేంద్రాల్లో టీచర్లు బల్ల భారతి, యశోద ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు చాలా ముఖ్యమైనవన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిముర్రు పాలు తాగించాలని, బిడ్డకు బిడ్డకు ఎడం పాటించాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో కళాజాత ద్వారా బాల్య వివాహ చట్టం, బాల కార్మికుల చట్టం, బేటి పడావో, బేటి బచావో కార్యక్రమాలతో పాటు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

- జీవీఎంసీ 58వ వార్డు ములగాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీచర్ సలోమి మాట్లాడుతూ ప్రభుత్వం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. తల్లిపాలను మించిన ఆహారం బిడ్డలకు మరొకటి లేదని అన్నారు.

వేగవంతంగా ప్రసాద్ పథకం పనులు



పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలిచారు. కొండదిగువ పుష్కరిణిసత్రం, కల్యాణమండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో టూరిజంశాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.